# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 27-03-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్ లోని 175 నియోజకవర్గాల్లో ప్రతి మూడు, ఆరు నెలలకొకసారి జాబ్ మేళాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **ఆన్‌లైన్ బెట్టింగ్ నిషేధించడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్టు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

3. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలిస్తారు.**

4. **మేడిగడ్డ బ్యారేజీ పై విజిలెన్స్ నివేదిక సిద్ధమయిందని తెలంగాణా నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.**

**5.** **ఈ రోజు ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్ లోని 175 నియోజకవర్గాల్లో ప్రతి మూడు, ఆరు నెలలకొకసారి జాబ్ మేళాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నైపుణ్య గణన పూర్తయ్యేలోగా .. నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతి జోన్‌కు ఒక ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాన్ని నోడల్ ఏజెన్సీగా గుర్తించాలని ఆయన స్పష్టం చేశారు. ఇంటి వద్ద నుంచి పని విధానంలో నమోదు చేసుకున్నవారికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో వెంటనే నైపుణ్య శిక్షణ ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. క్లస్టర్ ఆధారిత విధానంలో ఇప్పటికే నైపుణ్య శిక్షణ ప్రారంభించామని తెలిపారు.

--------------------------

అంతర్జాతీయ నేరంగా మారిన ఆన్‌లైన్ బెట్టింగ్ నిషేధించడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్టు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇలాంటి కేసుల్లో పడే శిక్షలను కూడా సవరించాల్సిన అవసరం ఉందన్నారు. బెట్టింగ్ నేరాల్లో ఏ విధమైన భాగస్వామ్యం ఉన్నా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరిస్తూ

వాయిస్ .. 30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయేతర భూమి చట్టం–నాలా చట్టాన్ని రద్దు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రాష్ట్ర సచివాయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా చట్ట రద్దుకు రాబోయే మంత్రివర్గ సమావేశంలోనే చర్చించి అవసరమైతే ఆర్డినెన్స్ తెస్తామన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ఎక్కువగా ఉండాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, పరిశ్రమలు పెట్టేవారికి రియల్‌టైమ్ విధానంలో అనుమతులు ఇవ్వాలని స్పష్టం చేశారు.

---------------------------

మేడిగడ్డ బ్యారేజీ పై విజిలెన్స్ నివేదిక సిద్ధమయిందని తెలంగాణా నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్డీఎస్ఏ తుది నివేదిక వచ్చిన తర్వాత మరమ్మతుల విషయంపై దృష్టిసారిస్తామన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు ప్రశ్నలకు మంత్రి వివరణ ఇచ్చారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని మంత్రి అన్నారు. తమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ఈ నెల 30 వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరా కార్యక్రమాన్ని మొదలు పెడతారని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. ఉదయం 10.45లకు పోలవరం చేరుకోనున్న ముఖ్యమంత్రి ప్రాజెక్ట్ నిర్మాణాలను పరిశీలిస్తారు. అనంతరం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

---------------------------

తెలంగాణాలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. శాంతిభద్రతల అంశంపై నిన్న శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో నేరాలు పెరిగాయన్న ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కొత్తగా 10 వేల సీసీ కెమెరాలను కొనుగోలు చేసి, వాటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేస్తున్నట్లు ఆయన వివరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల అభిప్రాయాలను తీసుకునేందుకు క్యూఆర్ కోడ్ విధానం అమలు చేస్తున్నమనీ మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

రాజమహేంద్రవరం సమీపంలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మృతి చెందిన ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌తో విచారణ జరిపిస్తామని ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. ఘటనపై నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ కొవ్వూరు టోల్ గేట్ సమీపంలో ప్రవీణ్ ద్విచక్రవాహనంపై వెళ్తున్నట్టు సీసీటీవీ ఫుటేజ్ సేకరించినట్లు తెలిపారు. సేకరించిన ఆధారాలపై లోతుగా దర్యాప్తు చేస్తామనీ, కేసు విచారణ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు

చేశామని పేర్కొన్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి హైదరాబాద్‌కు తరలించడం జరిగిందని ఎస్పీ వివరిస్తూ..

వాయిస్ 34 సెకన్లు

---

"ప్రపంచమే ఒక నాటక రంగం" స్ఫూర్తితో ఈ రోజు ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా శాంతి స్థాపనకు రంగస్థలం దోహదం చేయాలనే సందేశాన్ని అందిస్తూ 1962 నుండి అంతర్జాతీయ నాటకరంగ సంస్థ–ఐటిఐ ప్రతి ఏటా మార్చి 27వ తేదీన ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రజలను సామాజిక అంశాల పట్ల చైతన్య పరచడమే కాకుండా ఆయా దేశాల సాంస్కృతిక వారసత్వ చారిత్రక అంశాలను నేటి తరాలకు చేరవేసే వారధులుగా కూడా రంగస్థలం వేదికగా ప్రదర్శింపబడే అనేక ప్రక్రియలు దోహదం చేస్తాయని చాటిచెబుతూ... ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---

క్రీడలకు అంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో రాణించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ.. శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. జాతీయ 14వ విలువిద్యా పోటీలు గుంటూరు జిల్లా నంబూరులోని వివిఐటి విశ్వవిద్యాలయంలో నిన్న ప్రారంభమయ్యాయి. ద్రోణాచార్య అవార్డు గ్రహీత సంజీవ్ సింగ్‌తో కలిసి ఆయన ఈ పోటీలను ప్రారంభించారు. అమరావతి వేదికగా అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా గ్రామ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్న శాప్ ఛైర్మన్, విలు విద్యలో క్రీడాకారులు రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేయాలని అభిలషించారు.

---

హైదరాబాదులోని ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లు చూడటానికి వెళ్లే వారి కోసం తెలంగాణా ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సిటీలోని పలు ప్రాంతాల నుంచి స్టేడియానికి వచ్చేందుకు గ్రేటర్ పరిధిలోని 24 డిపోల నుంచి 60 ప్రత్యేక బస్సులు ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్న తేదీల్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

---

ఐపీఎల్ 18వ సీజన్ లో భాగంగా నిన్న జరిగిన మ్యాచ్ లో కోల్‌కతా నైట్‌రైడర్స్ రాజస్థాన్ రాయల్స్ పై 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 152 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా 17.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది.

కాగా ఈరోజు సన్ రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా మ్యాచ్ జరగనుంది.

---------------------------

జాతీయ స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రైతు సాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి. రామారావు అన్నారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కార్యక్రమ అమలులో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై ముడురోజుల రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు నగరంలో నిన్న ప్రారంభమైనది. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వ్యవసాయ శాఖకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

======================